# ఎండ

ముస్తాబు పూర్తయినట్లే.

మనసంతా ఉరకలు వేస్తోంది,

పరుగులు తీస్తోంది.

అక్క అనకూడదా - నా గొలుసు నువ్వేసుకో అని. నోరు తెరిచి తా నడగాలి కాబోలు. కమలాలయకి ఉడుకుబోత్తనంగా ఉంది. మూతి ముడుచుకొని, ఏదో గొప్పకష్టం వచ్చినట్లుగా, బరువుగా, బండి నీడుస్తు న్నట్లుగా ఉండటం కమల కిష్టంలేదు. ఇష్టం ఉండదు. తానైతానే కల కల్లాడిపోతూ, తుళ్ళుతూ, కేర్తూ ఉండకపోయినా! అక్కని చూస్తే అందుకే కోపం. అక్కకీ తనకీ ఏణ్ణర్థమే తేడా. ముందు అమ్మా నాన్నా, 'నువ్వొద్దే. పట్నంలో వాళ్ళవసతి ఏమిటో! మధ్య నీవెందుకిప్పుడు. తరవాత వెళ్ళొచ్చులే' అన్నారు. కాని తానే దెబ్బలాడింది. "పది రోజుల్లో వచ్చేస్తాలే, అంతగా వాళ్ళు నన్ను పోషించ లేకపోతే."

అన్నది. బావగారు పౌరుషం చూపారు. మొదటిసారి అక్క, మొగుడితో కొత్త కాపరానికి పట్నం వెళుతోంది. అక్కకి మాత్రం తోడొద్దూ? అదీ కమలవాదం. ఇంత మహాపట్నంలో ఎవరైనా పెళ్ళివాళ్ళు తటస్థపడితే బావుండు నన్నదికూడా అమ్మకీ నాన్నకీ లోపలఆశ. అంచేత పంపించారు.

'నిజమే' అంతపట్నంలో అయన స్నేహితులూ, తెలిసినవాళ్ళూ ఎందరో ఉంటారు. కమల చురుకైందీ. కలిసొస్తే వొడ్డున పడ్డట్టే. నాకు మాత్రం కొత్తచోట తోచవద్దా? ఇరుగు పొరుగూ, ఎవరో ఏమో. రావే' అన్నది అక్క. కాని అందులో ఆప్యాయత కన్నా, ఏదో స్వార్థమూ, ఏవిటో సాధిద్దామన్న ఆశా మాత్రమే కనబడ్డాయి కమలకు. ఒంటిస్నర గది-రెండో అంతస్తు కొత్తకాపురపిల్లు చూశాక, ఉత్సాహమూ, ఉబలాటమూ నీరుకారిపోయాయి. మనస్సులో ఏమిటో కలుక్కుమన్నట్లనిపించింది. పావురాళ్ళ గూళ్ళలాగా రెండో అంతస్తులో పన్నెండిళ్ళున్నాయి. కాళ్ళుపట్టుకుని ఎవరో గుంజుతున్నట్లూ, నెత్తిమీద ఎవరో ఎక్కికూచునట్లుగా వుంది, ఆ కొత్తకాపురపు ఇల్లు. తానైతే ఇలాటి ఇంట్లో, పెళ్ళయిన కొత్తరోజుల్లో – తలచుకోవటానికే చిరాకేసిందీ; భయమేసింది.

స్టవ్‌లో కిరసనాయిల్ వొంపుదామని ప్రయత్నిస్తోంది అక్క. అక్కమీద చెడ్డకోపమొచ్చింది. అన్నీ ఏబ్రాసిపనులూ, ఎడ్డె తనమూ. "బావగారూ! మనం ఇప్పుడు హోటల్‌కెళ్దాం, ఈపూట వంటచెయ్యటం కుదరదు," అన్నదీ. అక్కకి కోపమూ, తాపమూ, వొకేసారి ముంచుకొచ్చాయి. పగలల్లా బస్సుప్రయాణం; ఒళ్ళు హూనంహూనంగా వుంది. సాయంకాలం ఏడుగంటలైంది ఇల్లు చేరేసరికి. ఇప్పుడు అన్నం వండేసుకుని, ఏ ఊరగాయ ముక్కో వేసుకుని, భోంచేయాలంటుంది అక్క.

ఏదో సర్ది చెప్పబోయింది-పాపం. ఇప్పుడు హోటల్‌కి ఏంవెళ్తారులే అని. పోనీ 'ఇంట్లో వోడబ్బా బియ్యం పడెయ్యిగాని, మజ్జిగలేక కూర లేక ఎలానే' అని గునిసింది. కూరకైనా బజారు కెళ్ళాలా. సరే కారియర్ తెస్తాను' అని వెళ్ళిపోయాడు బావ. తనకైతే ముగ్గురూ వెళ్ళి హోటల్లో భోంచేసి రావాలనివుంది. అంతగా అక్కకిష్టం లేకపోతే, బావతో హోటల్ కెళ్ళటానికి తన కేమీ అభ్యంతరంలేదు. తా మిద్దరూ అక్కడ తినేసి అక్కకి కారియర్ తేవచ్చు.

బావ తనతో రమ్మనలేదు. అక్కడికే సిగ్గుపడింది 'మీ రక్కడ భోంచేసి మాకు కారియర్ పట్రండి. ఇప్పుడు మళ్ళీ బొగ్గులూ, కిరసనాయిలూ ఏం ముట్టుకుంటాం,' అంది. బావ నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఇల్లంతా బావ చక్కగా ఇదివరకే సర్దిపెట్టినట్టుగా వుంచాడు. అన్నీ ముందే తెచ్చిపడేశాడు. నిజానికి తనకు స్నానం చెయ్యాలనిపిస్తోంది. ఈ చలిలో ఏం స్నానం చేస్తావే అంది అక్క. అదే తనకు కోపం. అక్క కూడా హాయిగా స్నానం చేస్తే, మనసుకీ వొంటికీ ఎంతహాయిగా వుంటుంది. ఏడు దాటితే నీళ్ళు రావట! ఏడ్చుకోవటం కన్నా చేసే దేముంది ఇల్లు తుడిచేసింది. పక్కభాగం వాళ్ళకు బావ ముందే చెప్పినట్టుంది ఓ బిందెడు మంచినీళ్ళు త్యాగం చేశారు, సబ్బుపెట్టి ఆ నీళ్ళ లోనే కొన్ని వొంపుకొని మొహం కడుక్కుంది. అక్కని బలవంతపెట్టి, ముఖం కడుక్కునేలా చేసింది. అగరొత్తులు దేవుడిముందు వెదకి తెచ్చుకుంది. అప్పుడే పొద్దుపు ప్రారంభించినట్లుంది అక్క. అన్ని ఎందుకే వెలిగించటం. ఏ వొకటో రెండో వెలిగిస్తే సరిపోలా అన్నది. అబ్బ ఏం పీనాసిమనుషులుబాబూ - అనిపించింది. ఆ రాత్రి సరిగా నిద్రపట్ట లేదు. ఏవేవేవిటో పిచ్చివాసనలు. తనని వంటింట్లో పడుకోమన్నారు. వంటగది వాసన అంతకన్నా బావుంటేనా: మొదటిరోజే, ఎందుకు వచ్చానా అని విసుక్కుంది.

తెల్లారి లేచింతర్వాత కలయచూసింది. మూడంతస్తుల మహా భవనం. రెండో అర పావురాళ్ళగూళ్ళలో ఒకగూడు బావది. ఈ గది న్నరకి నలభై అయిదు ఇవ్వాలట మెట్ల దగ్గరనుంచి నీళ్ళు తెచ్చు కోవాలి. తేలిన సారాంశం అక్కడినుంచి బావ ఆఫీసు చాలా దగ్గర - అంటే రెండు మైళ్ళు, బస్‌లో పోయినా పదిహేను పైసలు. మర్రోజు పొద్దున కాఫీ తాగుతూ సవిస్తరంగా ఆ ఇంటి సౌకర్యాన్ని బావ చెబు తుంటే విస్తుబోవటం తన వంతైంది. అక్క తన భర్తగారి అదృష్టాన్ని మెచ్చుకునేలా చూస్తున్నది, 'ఏమి టీ కాఫీ ఇలా వున్నది?' 'మరేవిటను కున్నావు. మీ ఊళ్ళోలా వుంటుందా? మాకు బెజవాడ నుంచి రావాలి పాలు.' "ఈ ఊళ్ళో పాలేదొరకవా?" 'చాలా దొరుకుతాయి బాలా! వాటిజోలికి మనం పోలేం. వారంరోజుల్లో అన్నీ నువ్వే తెలుసు కుంటావు.' అన్నాడు బావ వేళాకోళంగా.

వారంరోజులు కూడా పట్టలేదు. నాలుగు రోజుల్లోనే తెలిసిపో యింది- పట్నవాసం సౌఖ్యం. మొహం మొత్తింది. చలి విపరీతం, పిట్ట గోడ నానుకు నిలబడితే - మహాభవనాన్ని ఆనుకునిపోతున్న పెద్దబజారు రోడ్డు, రోడ్డుమీద రిక్షాలు, కార్లు, లారీలు. ఆదుమ్మంతా శుభ్రంగావచ్చి ఇంట్లోపుస్తకాల మీదా, రేడియోనిండా, ఎత్తటానికి వీలులేని పక్కమీదా పడుతుంటుంది.

ఎండపొడకోసం తహతహ లాడిపోయేది కమల. బంగారమై పోయింది ఎండ. ఎనిమిది గంటలప్పుడు సరిగ్గా వో పావుగంట సేపటికి గదిముందు పిట్టగోడ సందున ఎండ పడేది. పేపర్ పట్టుకుని బావ నిలు చునేవాడు. స్నానానికో, షేవింగ్‌కో వెళ్ళగానే, తహతహలాడుతూ వచ్చేది కమల. అయితే మూడిళ్ళవతల, కాలేజీలో బి యస్‌సి. చదువు తున్నాట్ట చీకిరి, బాకిరి, పోకిరికుర్రాడు- పళ్ళికిలిస్తూ. ‹ఆహా! నా జన్మ

సార్థకంబాయెన్' అన్న పోజులో నిలబడి, గుచ్చిగుచ్చి చూసేవాడు. ఆ ఎండలో పరమానందాన్ని అనుభవించేవాడు. ఈ అపూర్వ దృశ్యం కనుమరుగైతే భరించలేనట్లుగా కాఫీ అక్కడే తాగేవాడు. ఒళ్ళు మండిపోయేది కమలాలయకు. చలికి వణికిపోతూ ఇంట్లోకి వెళ్ళేది. తలుపు తెరచి గోడదగ్గరకు రాగానే రోడ్డుమీద ఎదురుగా మాంసపుదుకాణం, అక్కడ వేలాడగట్టినవన్నీ చూస్తే తల తిరిగిపోయి, కళ్ళు మసకలు కమ్మినంత పనైంది కమలకు. పెద్ద దుంగమొద్దు మీద, చిన్న మొద్దు కత్తితో టకా, టకా, టకా గదిలో కూమన్నా చప్పుడు వినపడేది. బావను తలుచుకుంటే చాలా కోపం వచ్చేది. పొద్దున తొమ్మిదికల్లా ఆ మాంసపు దుకాణం తెరుస్తారు. ఒక రోజున చూసింది; సైకిల్ రిక్షాలో సీటునిండా తోలువొలిచిన కళేబరాలను వేసుకుని తేవటం. ఒక్కోరోజున సైకిల్ వెనకసీటుమీద పెట్టుకుని తెచ్చేవాడు. వంటగదిలో పడుకోవటం తప్పనిసరైంది. "ఏమిటే రాత్రిపూట వంటగదిలో అదోవాసన" అనిఅడిగింది. అక్కను. మహాభవనం వెనకాల కల్లు అమ్మే దుకాణం వున్నది. రాత్రి ఎనిమిది అయ్యేసరికి వీధిలో కాళ్ళు తడబడుతూ, తూలుతూ, పేలుతూ పోయే మనుషులను చూస్తే, తన కేమిటో భయమనిపించేది. రెండో అంతస్తులోని పన్నెండిళ్ళలో ప్రతిరోజూ ఎవరో వొకరు పక్కింటి వాళ్ళతో పోట్లాట పెట్టుకునేవారు. పంపుసీళ్ళ దగ్గరో, చెత్తబుట్ట దగ్గరో పోట్లాట తప్పదు. బావ సైకిల్ మెట్లదగ్గర వుంచటం తక్కినవాళ్ళకిష్టం లేదు. సైకిల్ తీసుకురావటం సులభంకాదు. నాల్రోజులకొకసారి సినిమాకి వెళ్ళొచ్చు ననుకొంది గక్కడకు వచ్చేముందు. వారపత్రికలు ఎప్పటికప్పుడు రాగానే కొనెయ్యొచ్చు ననుకుంది. ఆఫీసులో పదిమంది కలసి చందాకడతారుట. వంతులువారీగా తీసికోవాలట. తనకావలసిన పత్రిక మూడు నాలుగుసార్లు చెప్పింతరవాత కాని బావ తీసుకుని రాలేక పోయినాడు ఆదివారం పబ్లిక్‌గార్డన్స్‌కి వెళ్దామంది కమల. ఎవరో స్నేహి

తులు వస్తారని తప్పించుకో జూశాడు. మళ్ళా వచ్చే ఆదివారం నేను ఊరికెళ్ళిపోతాను. కాబట్టి వెళ్ళిరావాలని పట్టుపట్టింది. మళ్ళీ తోట్లపాలెం వెళ్ళింతరవాత ఎవరైనా ఏం చూశావని అడిగితే తనకు చాలా చిన్నతనంగా వుంటుంది. ఇంకో పదిరోజులుందువుకానిలే అన్నదీ అక్క. 'కాదు–నేను వెళ్ళాలి' అన్నది తాను. "ఏం, అమ్మానాన్నగార్ల పైని బెంగకాబోలు. రేపు పెళ్ళయితే' అని చమత్కరించబోయాడుబావ. పెళ్ళయితే అని తలుచుకోవటమే భయంగావుంది. ఒకే ఇదిగా శేఖరం గుర్తువస్తున్నాడు. శేఖరానికి క్షమాపణ చెప్పుకోవాలనిపించింది చాలా సార్లు. ఆదివారం ఉదయానమ్యూజియంకి తీసుకెళ్ళాడు బావ. మ్యూజియం నుంచి బయటపడి చార్మినార్‌ను చూసేసరికి చీకటి పడిపోయింది. రిక్షామాట్లాడుతూంటే, టాక్సీలో పోదామన్నదితాను. బావ తనవేపు వింతగా చూశాడు. అక్క కోపంగా చూసింది. టాక్సీలు దొరకవన్నాడు. రిక్షాల్లో ఎక్కటం తప్పనిసరి అయింది. "రేపు సినిమాకెళ్దాం, వచ్చే ఆదివారం నేను ఊరి కెళ్తాను, రేపు నాన్నకి ఉత్తరం రాస్తాను, అన్నది కమల. అక్క ముభావంగా ఊరుకుంది. బావజీతం దగ్గరదగ్గర మూడొందలు అని అమ్మా నాన్నావాళ్ళు అనుకోవటం తనకు గుర్తు. పోనీ యాభై రూపాయలు అద్దె పోయినా, ఏమిటి యీ కటకిట అనిపించింది కమలకు. అక్కను అడిగింది. "నువు చిన్నదానివి. నీకు తెలీదులే" అంది అక్క. ఆవాళ ఆఫీసులోనే వుండిపోవాల్సివచ్చిందని సాయంకాలం ఆలస్యంగా ఇంటికి వచ్చాడు బావ.

"కమిలకి కోపం వచ్చినట్లుంది. రేపు మధ్యాహ్నం శలవు పెట్టేసి వస్తానులే," అన్నాడు అనునయంగా; కమలకి జాలేసింది.

ఆ మర్రోజు బావ రాకకే యీ తొందర, ఈ ముస్తాబు. సినిమా కెళ్ళాలి, నాన్నకి ఉత్తరం రాసి పడేసింది – ఆదివారం బస్‌లో వచ్చేస్తున్నానని,

పట్నవాసం ఎంత సౌఖ్యమో అని మురిసిపోయింది. అక్క అదృష్టవంతురాలని అభిమానంతో కూడిన అసూయకూడా కలిగింది తనకు. కాని.... కాని, గాలీ వెలుతురూ, చెట్లూచేమలూ, ఆకాశమూ ఎండా మనుషులకి సుఖం ఇవ్వవు, అవి సుఖం ఇస్తవని కూడా యీ మనుషులకి తెలీదు. ఇక్కడ ఎనిమిదిన్నర కాకముందే పరిగెత్తుతుంటారు. రైలుప్రయాణం చేస్తున్నట్లుగా వుంటుంది. రైలుప్రయాణం సరదాగానే వుంటుంది. తమ ఊరు రాగానే దిగిపోవాలని ఆత్రుతా, సరదా అయినా వుంటాయి. ఊరెక్కడో, ఎక్కడ దిగాలో తెలీని రైలు ప్రయాణం ఇది. 'ఒకటో తేదీ రానివే వెళుదువుగాని' అంది అక్క ఎందుకని గుచ్చిగుచ్చి అడగలేదు.... తాను. తెలిసిపోతూనేవుంది ఎగ్జిబిషన్ చూసిపోదువుగాని అంటుంది అక్క, నెలమధ్యలో నువ్వెలా వెళ్తావు అని చెప్పటం ఇష్టంలేక. కాని తన మనసు వుండబట్టటం లేదు.... పెరట్లో అందమైన బావిగట్టు, బాదంచెట్టు, బంతిపువ్వులు, చామంతి మడి, దొండపాదునిండా కాయలు. కాఫీ అయిందే కమల, తెములు అని అమ్మ మందలింపు. వీపుమీద వెచ్చని ఎండ పడుతుంటే, గిలిగింతలు పెడుతుంటే, గాబు దగ్గర చామంతిపూలు ఎన్నివిచ్చాయో లెక్కపెడుతుంటే, బాదం చెట్టుమీది పండుటాకులు రాలిపడుతుంటే, అవతలి పెరట్లోంచి శేఖరం తనని అపేక్షగా, అప్యాయంగా, ఆశగా చూస్తూంటే, రాత్రి వారపత్రిక తెచ్చాను స్కూలు నుంచి - ఇవ్వనా, అని వంకపెట్టుకొని పలకరిస్తుంటే, తను ముభావంగా మారుపలక్కుండా, దర్పణంగా మూతి ముడుచుకొంటుంటే, శేఖరం చిన్నబోతూ తన వేపు పులుకు పులుకు చూస్తూవుంటే.... ఆ అతిశయం తనకి పదేపదే గుర్తొస్తున్నది.

తన మనసు ఉదయం కాగానే ఎండకోసం తపించిపోతున్నది, ఉరకలు వేస్తోంది, ఉబలాటపడుతోంది. చెరువు గట్టునే శివాలయంలో కార్తీక మాసంలో ఎంత సందడి. సాయంకాలం మిలమిల మెరిసిపోయే

పచ్చని ఎండ, పచ్చ గన్నేరు చెట్లమీద పూలమీద మెరిసిపోతుంటే, స్కూలు నుంచి వస్తూ శేఖరం తనని పలకరించాలని చొరవచేస్తుంటే, తాను ఎక్కడినుంచో ఎక్కడో పడిపోయినట్లుగా అనిపిస్తున్నది. అక్క ఇక్కడ ఎలా వుండగలదా అని జాలేస్తున్నది; దుఃఖం వస్తున్నది. సావిట్లో అరుగుమీద పుష్యమాసంలో పొద్దున్నే ఎండ రాగానే కూచుని కాఫీ తాగుతుంటే, ఎంత సంతోషంగా ఉండేదో!

ఇవాళ తప్పకుండా సినిమాకు తీసుకెళ్తానన్నాడు బావ. తోట్లపాలెం వెళ్ళిపోతే, పని గట్టుకుని పక్కఊరి కెళితేగాని సినిమా చూడటానికి వీలుపడదు. దానికంతా ఎంతో తతంగం జరగాలి. నాన్నో, అమ్మో ఎవరో బయలుదేరాలి తమవెంట. తామిద్దరే ఆడపిల్లలు పుట్టారు కనక, ప్రతిదానికీ తలిదండ్రులకు అబ్బురమే. తనకు పెళ్ళిచేసి పంపిస్తే ఎలానా అని అమ్మానాన్నలకు అప్పుడే దిగులు పట్టుకుంది. వాళ్ళకు శేఖరమంటే ఇష్టమే. శేఖరం అక్కడే మిడిల్‌లో టీచరుగా పనిచేస్తున్నాడు. తనకు ఇష్టంలేదు. శేఖరం తండ్రికి పక్షపాతం వచ్చి మంచాన పడ్డారు. అంచేత శేఖరం, ఆ ఊళ్ళోనే వుండిపోవల్సివస్తుంది. అదీ తనకు ముఖ్యమైన అభ్యంతరం. బావ ఏవో రెండు మూడు సంబంధాలు గురించి అక్కతో చెబుతుంటే తనకు మొఖం మొత్తినట్లనిపించింది. అంతగా వాళ్ళకిష్టమైతే మాఊరొచ్చి చూడమను. వారి వీలూచాలూకోసం నేనిక్కడ వుండిపోతానా యేం! అని బావతో ఖచ్చితంగా చెప్పింది కమల.

'ఏమిటి నీధీమా' అని ఆశ్చర్యపడకపోలేదు అక్కాబావలు. అవును పెళ్ళంటే ఆడపిల్లలకి మాత్రమేనా ఆ అక్కర. మగవాళ్ళకి మాత్రం బాధ్యత లేదుకాబోలు—అని తన ప్రశ్న, ఆ ప్రశ్నవేస్తే అంతా తెల్ల మొహాలు వేసేవాళ్ళే. ఏవో కుంటిసాకులు చెప్పేవాళ్ళే.

సాయకాలం ఆరైపోయింది; అరుకూడా దాటిపోయింది. బావ రాలేదు. కమలకి చాలా అవమాన మనిపించింది. పొద్దున్నే ఊరికెళ్ళి పోవాలనిపించింది.

మూడిళ్ళవతల వాళ్ళభాగంలో, వాళ్ళపాపకి అకస్మాత్తుగా జబ్బు చేసి, ఆ తల్లి ఏడుస్తూకూచుంటే, అక్క వెళ్ళింది. తానూ వెళ్ళి చూదా మనుకుందీ, కాని తనకి భయం. మనసంతా బెంగ.

కమల మనసంతా గుబులుగుబులుగా వుండిపోయింది. గంటతర్వాత అక్క వచ్చింది. ఆ ఇంటాయన ఇంతకు ముందే వచ్చాట్ట- పాపని ఆస్పత్రికి తీసుక వెళ్ళారు. బావ రాలేదు. తాను చేసుకున్న ముస్తాబు తనని వెక్కిరిస్తున్నట్లనిపిస్తున్నది. బావ వచ్చి, వాళ్ళు భోజనం చేస్తే గాని, తను నిద్రపోయేందుకు కూడాలేదు. మనస్సు పూర్తిగా అలసి పోయినట్లనిపిస్తున్నది. అక్కమాత్రం ఏం చేస్తుంది పాపం.

పదింటి కెపుడో వచ్చాడు బావ. ఆఫీసు నుంచి నేరుగా ఆఫీసరు గారింటికి వెళ్ళవలసివచ్చిందట. అనుమానంగానే చెప్పాడు.

ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు.

బావేమిటో సముదాయిస్తున్నాడు. అక్క ఏమిటో నిష్ఠూరాలాడు తున్నది. మధ్య మధ్య సన్నగా అక్క ఏడుపుకూడా వినపడుతున్నది. ఊరికెళ్ళిన తర్వాత శేఖరం తనని ఆప్యాయంగా పలకరిస్తే, విరసంగా సమాధానం చెప్పకూడదనుకుంది. ఆపేక్షగానేమాట్లాడాలి. మనుషుల్ని ఎవరినీ నొప్పించకూడదు. మనసుకి నొప్పి కలిగితే ఆ నొప్పి భరించడం కష్టం,

బావ పొద్దున్నే ఎనిమిదింటికే వెళ్ళిపోయాడు. తాను అడగకూడ దనే అనుకున్నది గాని అడిగింది. 'రాత్రేమిటి మీరు మాటా మాటా అను

కున్నారు :' అని. అక్క తెల్లబోయింది. 'ఎవరితోనూ అనకే' అని బతిమాలింది. 'ఏముందికనక అనటానికి ! నువు చెప్పనేలేదు గదా ఏం జరిగిందో అక్క చెప్పటానికి విపరీతంగా బాధ పడిపోయింది.

"ఎవరో స్నేహితులు బలవంతంచేస్తే, కాస్త పుచ్చుకున్నార్ట. నేనేంచేసేది ? మనసూ, శరీరమూ అలిసిపోయే పని. పైన పై అధికారుల సాధింపులు, తృణీకారాలు. వాళ్ళు శుభ్రంగా పుచ్చుకుంటారు, అందుచేత ఏమాట ఎట్లా మాట్లాడేది వాళ్ళకు తెలీదు. అవతల వాళ్ళుకూడా మనుషులేననీ, వాళ్ళకూ కష్టసుఖాలు వుంటాయనీ వాళ్ళకు తెలీవద్దా.

"ఏం. ఇంతలో ఒక్కరోజు, ఎవరి బలవంతంపైనో కొంచెం పుచ్చుకుంటే. ఏడ్చి మొత్తుకొని దెబ్బలాడాలా !" అన్నది తాను. అక్క విస్తుపోయింది.

'మా మొహాలకు అదొక్కటే తక్కువ.'

'ఉన్నంతలోనే నిబ్బరంగా వుండాలి ! మంచీ చెడా ఆయనకి మాత్రం తెలీదా ?'

"నీకు తెలీదు కమలా ! నెలజీతం నెమ్మదిగా ఇల్లుగడుపుకుందుకే సరిపోకపోతుంటే, ఇలాంటివాటిజోలికి పోతే ఎలా సంసారాలు నిర్వహించుకోవటం ?"

కమల మాట్లాడలేదు. పేద్ద సంతలాగా వున్నది మహాపట్నపు కాపురం, బాగా డబ్బూ, గొప్ప హోదా, మనుషులకు తగని మదమూ వుంటేనే ఇక్కడ సౌఖ్యం, అని తెలిసిపోతూవుంది. మధ్యతరగతి కుటుంబాలూ, చిన్న చిన్న జీతాలవాళ్ళూ ఇరుకుగా బతకాల్సిందే.

తాను ఊరికి వెళుతుంటే బావ చీర తెచ్చాడు. ఇంకా మంచిదైతే బావుండేదని తన కనిపించకపోలేదు. కాని ఇక్కడ, యీ మహాపట్నంలో మనుషులకి వేడుకలూ, ముచ్చట్లూ ముఖ్యం కావు.

"ఇంత తొందరేం కమలా! మా స్నేహితుడొకడు క్యాంపుకి వెళ్ళాడు. రాగానే వాళ్ళ అమ్మగారిని తీసుకొనివచ్చి నిన్ను చూస్తా మన్నారు. ఉండకూడదూ?" అన్నాడు బావ.

"వాళ్ళమ్మగారితో మాఊరే రావచ్చుకదా బావా! అని తేల్చేసింది తాను.

"నిన్ను నాలుగైదు సార్లయినా సినిమాకి తీసుకెళ్ళలేకపోయాను. ఇక్కడ తీరిక వుండదు. మా బతుకులింతే,"

'మునిగిపోయిందేమీ లేదిప్పుడు. అలా మాట్లాడకు బావా" అని నొచ్చుకుంది తాను.

అక్కా బావా ఇద్దరూ వచ్చిబస్ ఎక్కించారు. బస్‌లో ప్రయాణం చేసినంతసేపూ, శేఖరమే కళ్ళముందు మెదిలాడు. శేఖరమంటేనే ఇప్పుడు తన కిష్టంకలుగుతున్నది. తన ముఖావాన్ని ఇన్నాళ్ళూ శేఖరం ఎలా అర్థంచేసుకున్నాడో! అపేక్షగా శేఖరాన్ని పలకరిస్తుంది తాను. తన కిష్టమే నిన్ను చేసుకోవటం అనికూడా చెపుతుంది. కావలిస్తే వాళ్ళిం టికి వెళ్ళి, వాళ్ళమ్మగారినీ నాన్నగారినీ కూడా చూడాలి.

తోట్లపాలెంలో అడుగు పెట్టగానే ప్రాణం లేచివచ్చినట్లనిపించింది కమలకు.

"చిక్కిపోయావే తల్లీ! అని అమ్మఆప్యాయత వొలకబోస్తుంటే, పసిపిల్లలను లాలిస్తున్నట్లే అనిపించింది.

అక్కా బావల గురించి అమ్మా, నాన్నా ఎంతగానో అడిగారు.

పెరట్లోకి అడుగు పెట్టగానే, పోయిన వస్తువేదో దొరికినట్లని పించింది కమలకు. చేమంతి మడినిండా పువ్వులు కలకలలాడి పోతు న్నాయి, పోకబంతి చెట్లూ, కుంకుమ బంతులూ నిండా మొగ్గలొడిగాయి. శేఖరం కోసం కళ్ళు తపనపడ్డాయి. ఏమని అడుగుతుంది? ఎవరిని?

ప్రతిరోజూకన్నా ఎక్కువసేపే పెరట్లో తారట్లాడింది కాని. శేఖరం కన్పించలేదు.

సాయంకాలందాకా చూసి వుండబట్టలేక తల్లిని అడిగింది.

"ఏమోనమ్మా. ఏదో పరీక్ష రాయటానికి వెళ్ళాడంట- మొన్న ఎప్పుడో కనబడ్డప్పుడు చెప్పాడు. ఈ ఊళ్ళో తానుండలేడుట. ఎన్నాళ్ళిలా ఎదుగూ బొదుగూలేక వుండటం అంటాడు. వాళ్ళ తండ్రికి పెద్ద బాధొచ్చి పడిందిప్పుడు. ఇల్లు కదలలేడాయె. మొగ పిల్లవాడు లేడను కుంటే మేము, ఉన్నవాళ్ళకు ఆ పాట్లు తప్పటం లేదు." కమల మనస్సు కలుక్కుమంది. తన మనసులో పెద్ద అనుమానం. శేఖరం తన మనస్సు గ్రహించే వుంటాడు. పట్నవాసపు మోజు తెలుసుకొని, ఇలా చేస్తున్నా డేమో! ఆ రోజంతా మనసునిండా శేఖరం ఊరు విడచి వెళ్ళిపోవటమూ వాళ్ళ అమ్మానాన్నా బెంగపడటమూ, కలచివేశాయి.

మర్రోజు ఉదయం పెన్నిధిలా కనపడ్డాడు. శేఖరం. "ఎప్పు డొచ్చావు కమలా!" అని ఆపేక్షగా పలకరించాడు. "నిన్ననే వచ్చాను. నువు కనపళ్ళేదు" అని వాకబు చేసింది. "ఇక్కడ ఉద్యోగం రిజైన్ చేశాను. ఎం. ఎల్. ఏ. గారిని కలిసికొని వచ్చాను. హైద్రాబాద్ వెళ్ళి ఏదైనా చిన్న ఉద్యోగం చూసుకొని నైట్ కాలేజీలో చేరి చదువు కుంటాను. ఆ తరవాత ఎలా వుంటుందో భవిష్యత్తు. ముందుకష్టపడితేగా తరువాత సుఖపడటం."

బంగారపు యెండ తళతళా మెరుస్తూ వీపుమీద పడి వెచ్చని చక్కిలిగింతలు పెడుతున్నది. మనోహరమైన ఉదయవేళ, వెచ్చని ఎండలో వెన్నుల్లోంచి చలిపుట్టుకొచ్చింది కమలాలయకు శేఖరం మాటలతో.